# సాక్షి తిరుపతి

శుక్రవారం । 14 । జూన్ । 2024




**ప్రాణాలు పోతేగానీ..**
శ్రీకాళహస్తిలో బ్రిటీష్ పాలనలో నిర్మించిన రామసేతు వంతెన ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఇనుప ఆర్చి దెబ్బతింది. - 8లో



**శ్రీవారి సేవలో ప్రముఖులు**
తిరుమల శ్రీవారిని గురువారం కేంద్ర మంత్రి పియూష్ గోయల్, సినీనటుడు సాయికుమార్ దర్శించుకున్నారు. - 8లో



**లై'సెన్స్'తప్పనిసరి**
జిల్లాలో వాహనాలు కొనుగోలుపై ఉన్న శ్రద్ధ లైసెన్సులు తీసుకోవడంలో లేదని రవాణాశాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### అధినేతతో ఎమ్మెల్సీ



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి

**చిల్లకూరు:** తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ ఎమ్మెల్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి పార్టీ అధినేతను కలిశారు. ఇటీవల నెల్లూరు, తిరుపతి జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై పలు విషయాలను చర్చించినట్లు ఆయన వెల్లడించారు.

### డిప్లొమా స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**వెంకటగిరి రూరల్:** వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఖాళీగా ఉన్న డిప్లొమా కోర్సులను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు పీకేఎం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎస్.గిరిధర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు, మూడు సంవత్సరాల లెటరల్ ఎంట్రీ (డీహెచ్‌టీడీ)కు ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### పుష్పయాగానికి అంకురార్పణ

**తిరుపతి కల్చరల్:** శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో శుక్రవారం జరగనున్న స్వామి వారి పుష్పయాగానికి గురువారం సాయంత్రం 6.30 నుంచి సేనాధిపతి ఉత్సవం చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా శ్రీవిష్వక్సేనుల వారు ఆలయ మాడ వీధుల్లో విహరించారు. తర్వాత అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలు, పత్రాలను స్వామివారికి నివేదిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు వీధి ఉత్సవం జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

## గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి

## శ్రీవారిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన బుధవారం సాయంత్రమే తిరుమలకు చేరుకుని అక్కడే బస చేశారు. అనంతరం గురువారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూ ప్రసాదాలు అందించారు. రంగనాయకుల మండపంలో పండితులు వేదఆశీర్వచనాలు అందించారు.

– తిరుమల



తిరుమలలో సీఎం చంద్రబాబునాయుడు కుటుంబం

# గుడ్‌మార్నింగ్ టీచర్!

బడి'బుడి' అడుగులు వడివడిగా పడ్డాయి. గణగణమంటూ బడి గంట మోగగానే ఇంట్లోనూ తల్లిదండ్రుల ఉరుకులు పరుగులు కనిపించాయి. ముందుగా దైవదర్శనాల కోసం పరుగులు తీశాయి. ఆనాక బడిగుడికి బయలుదేరాయి. ఈ క్రమంలో ఇన్నాళ్లూ ఇంటిపట్టునే ఉన్న పిల్లలు ఆకట్టుకునే రంగులు అద్దుకుని రా..రమ్మంటూ ఆహ్వానం పలుకుతున్న పాఠశాలలను చూసి మురిసిపోయారు. ఉపాధ్యాయులను చూసి ఉప్పొంగిపోయారు. మొదట తమ చదువులు చక్కగా సాగాలని దేవుడ్ని ప్రార్థించారు. ఆ తర్వాత తరగతి గదిలోకి అడుగుపెట్టగానే.. ఉపాధ్యాయులను చూసి 'గుడ్‌మార్నింగ్ టీచర్..' అంటూ పలకరించారు. గత ప్రభుత్వ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన విద్యాకానుక కిట్లు అందుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు.



తిరుపతిలోని ఎంజీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వడివడిగా వెళ్తున్న విద్యార్థులు



పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

### వేసవి సెలవులకు బైబై

- మోగిన బడి గంట
- తొలిరోజే 70 శాతం మందికి విద్యాసామగ్రి అందజేత



తిరుపతి : అటెండెన్స్ వేస్తున్న ఉపాధ్యాయులు

**తిరుపతి ఎడ్యుకేషన్:** దాదాపు 49 రోజులు నిశ్శబ్ద వాతావరణం అలముకున్న పాఠశాలలు ఒక్కసారిగా కళకళలాడాయి. గణగణ మంటూ బడిగంట మోగడంతో విద్యార్థులు ఉరుకులు.. పరుగులు తీశారు. గురువారం సుదీర్ఘ వేసవి సెలవులనంతరం స్కూల్ బ్యాగులు పట్టుకుని బడిబాట పట్టారు. పాఠశాలల పునఃప్రారంభం కావడంతో తొలిరోజు ఉదయాన్నే తల్లిదండ్రులు తమ పిల్లలను నిద్రలేపి, స్నానం చేయించి, తలదువ్వి, పౌడర్ కొట్టి స్థానికంగా ఉన్న ఆలయాలకు తీసుకెళ్లి పూజలు చేయించారు. అనంతరం పాఠశాలలకు తీసుకొచ్చి క్లాస్ రూమ్‌లో వదిలిపెట్టారు. ఉపాధ్యాయులు తరగతి గదులను శుభ్రం చేయించి పాఠశాలలను పచ్చని తోరణాలతో సిద్ధం చేశారు. బడిగంట మోగగానే విద్యార్థులు ప్రార్థన చేసి తరగతి గదులకు వెళ్లారు. అనంతరం గుడ్ మార్నింగ్ మేడమ్.. గుడ్ మార్నింగ్ సర్.. అంటూ తరగతి గదుల్లో చదువులు ప్రారంభించారు. తొలిరోజు కావడంతో ఉపాధ్యాయులు సరదాగా కాసేపు పిల్లలతో ముచ్చటించారు. వేసవి సెలవుల్లో ఎలా గడిపారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత తరగతులను ప్రారంభించారు.

**స్టూడెంట్ కిట్ల అందజేత**

గత ప్రభుత్వం పాఠశాలల పునఃప్రారంభం నాటికే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరిట స్కూలు బ్యాగు, యూనిఫాం, షూ, సాక్స్, బెల్టు, టై, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను కలిపి ఒక కిట్టుగా అందజేసేది. ఈ ఏడాది కూడా వీటిని గత ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లాలోని 2,334 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో బాలురు 73,646 మంది, బాలికలు 75,130 మంది, మొత్తం 1,48,776 మంది విద్యార్థులు ఉండగా.. వీరందరికీ ఇప్పటికే 1,48,776 బ్యాగులు, యూనిఫాం, షూలతో పాటు ఇతర విద్యాసామగ్రి చేరుకున్నాయి. వీటిని తొలిరోజే దాదాపుగా 70 శాతం మేర విద్యార్థులకు అందజేశారు. మిగిలిన వాటిని రెండు మూడు రోజుల్లోనే విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందజేస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు.

**తిరుపతి జిల్లా సమాచారం**

| ప్రాథమిక పాఠశాలలు | ప్రాథమికోన్నత పాఠశాలలు |
|---|---|
| 1,817 | 194 |
| **ఉన్నత పాఠశాలలు** | **మొత్తం** |
| 323 | 2,334 |



తిరుపతి : అంగన్వాడీ కేంద్రంలో పాలు పంపిణీ చేస్తూ..







తరగతి గదుల్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

## నిర్లక్ష్యం వీడని కండక్టర్లు

- బస్టాండ్ ఆవరణలోనే దిగేస్తున్న వైనం
- రామానుజ సర్కిల్ వరకు వెళ్లాల్సి ఉన్నా పట్టించుకోని సిబ్బంది
- తీవ్రంగా నష్టపోతున్న ఆర్టీసీ
- శ్రీకాళహస్తి వైపు వెళ్లాలంటే తిప్పలే

**తిరుపతి అర్బన్:** కొందరు కండక్టర్ల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. ఆర్టీసీకి తీవ్ర నష్టాలు తెచ్చిపెడుతోంది. జిల్లాలో ఆలయాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయగా.. ఇందులో తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి 56 సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో దాదాపు 90 శాతం బస్సులు వన్‌మన్ సర్వీసులే. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని శ్రీహరి బస్టాండ్‌లో 8, 9 ప్లాట్‌ఫాంలు శ్రీకాళహస్తికి కేటాయించారు. బస్టాండ్‌లోనే 50 శాతం సీట్లు భర్తీ అవుతుంటాయి. తర్వాత బస్టాండ్ నుంచి రామానుజ సర్కిల్ వరకు కండక్టర్లు వెళ్లాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి పలుమార్లు కండక్టర్లను ఆదేశించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు రామానుజ సర్కిల్ వద్ద ఉంటారని, అక్కడి వరకు వెళ్లాల్సిందేనని దిశానిర్దేశం చేశారు. కానీ ఆర్టీసీ వన్‌మన్ సర్వీసులకు చెందిన కండక్టర్లు బస్టాండ్‌కే పరిమితమవుతున్నారు. దీంతో బస్సులో సీట్లు ఖాళీగా ఉన్నా డ్రైవర్ రామానుజ సర్కిల్ వద్ద నిలపలేని పరిస్థితి. అక్కడి భక్తులు, ప్రయాణికులు ప్రైవేటు సర్వీసుల్లో శ్రీకాళహస్తికి చేరుకోవాల్సి వస్తోంది. కనీసం బస్టాండ్ నుంచి కండక్టర్లు దక్షిణం వైపు వరకు వెళ్లి టిక్కెట్లు కొట్టినా ప్రతి సర్వీస్‌కు మరో 5 నుంచి 10 మంది ప్రయాణికులు పెరిగే అవకాశం ఉంది. బస్టాండ్ నుంచి పడమర వైపునే(20 మీటర్ల దూరంలో) కండక్టర్లు దిగిపోతుండడంతో తిప్పలు పడాల్సి వస్తోంది.

**కండక్టర్లకు స్పష్టం చేశాం**

శ్రీకాళహస్తి సర్వీస్‌లో టిక్కెట్లు కొడుతున్న కండక్టర్లు బస్టాండ్ లేదా పడమర వైపు వరకు పరిమితం కాకుండా దక్షిణం వైపు వరకు వెళ్లాల్సిందే. అవసరమైతే బస్టాండ్ సమీపంలోని రామానుజ సర్కిల్ వద్దకు పంపుతాం. సర్వీసులను అందుబాటులో ఉంచుతాం.

–డీఆర్ నాయుడు, జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి

# మెగా కాదు.. చోటా!

- జిల్లాలో 500 లోపు పోస్టుల భర్తీకి మాత్రమే అవకాశం
- ఫిబ్రవరిలోనే 336 పోస్టులతో గత ప్రభుత్వం నోటిఫికేషన్
- ఎన్నికల నేపథ్యంలో ఆగిన డీఎస్సీ ప్రక్రియ
- ఇప్పుడు కొత్త డీఎస్సీ పేరిట సంతకం
- ఖాళీలపై విద్యాశాఖ కసరత్తు



**చిత్తూరు అర్బన్:** ముఖ్యమంత్రి హోదాలో మెగా డీఎస్సీపై చంద్రబాబు నాయుడు సంతకం చేయడంతో జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇది పేరుకు మెగా డీఎస్సీ అయినా.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 500 లోపు మాత్రమే పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**నాలుగు నెలల క్రితమే..**

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో చిత్తూరు, తిరుపతి, మదనపల్లె కలిపి ఉమ్మడి జిల్లాకు సంబంధించి 336 పోస్టులను ఖాళీలుగా చూపించింది. వీటిలో స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు (ఎస్జీటీ) 101, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) 97, టీజీటీ 139 చొప్పున ఖాళీలు ఉన్నాయి. వీటితో జోన్ వారీగా ఏపీ మోడల్ స్కూల్, బీసీ, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలతో పాటు ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలల్లోనూ ఖాళీలు చూపించింది. మార్చి 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో డీఎస్సీను వాయిదా వేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా టీడీపీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీపైనే తొలిసంతకం అని హామీ ఇచ్చి, ఆ మేరకు మెగా డీఎస్సీ పేరిట ఇప్పుడు చంద్రబాబు సంతకం కూడా పెట్టారు.

**ఖాళీలు చూపితే తప్ప..**

ఈ డీఎస్సీలో పోస్టులు పెద్దగా ఉండకపోవడం వల్ల చోటా డీఎస్సీనే అని నిరుద్యోగులు భావిస్తున్నారు. పైగా జిల్లాల వారీగా విద్యాశాఖలో ఉన్న టీచర్ పోస్టుల ఖాళీలను తీసుకున్న తరువాత నోటిఫి కేషన్ వెలువడడం ఆనవాయితీ. కానీ ఇపుడు నోటిఫికేషన్‌పై సంతకం పెట్టేశాం.. ఖాళీలు చూపండి అనే పరిస్థితి. జిల్లాలో ఎస్జీటీ, ఎస్ఏతో పాటు టీజీటీ పోస్టుల ఖాళీలపై జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించాల్సి ఉంది. ఈనెలాఖరుకు గానీ ఖాళీలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారి ఆలయం ఎదుట సినీ నటుడు సాయికుమార్

**తిరుమల:** తిరుమల శ్రీవారిని గురువారం కేంద్రమంత్రి పియూష్ గోయల్, సినీ నటుడు సాయికుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు స్వామివారి ప్రసాదాలను అందించి సత్కరించారు.

## అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి



అమ్మవారి ఆలయంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ దంపతులు

**చంద్రగిరి(తిరుచానూరు):** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయల్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# లైసెన్స్ ఉండాలిగా!

- జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న వాహనాలు
- వాహన కొనుగోలుపై ఉన్న ఆసక్తి లైసెన్స్ తీసుకోవడంలో చూపని వైనం
- నైపుణ్యం లేకుండానే వాహనాలు నడుపుతున్న మైనర్లు, మహిళలు
- ప్రమాదాలు జరుగుతున్నా కన్నెత్తి చూడని అధికారులు



రోడ్లపై బైక్‌లు నడుపుతున్న మైనర్లు

**తిరుపతి మంగళం:** రాష్ట్రంలోనే అత్యధిక వాహనాలున్న తిరుపతి జిల్లాలో డ్రైవింగ్ లైసెన్స్‌ల సంఖ్య అందుకు భిన్నంగా ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 8 లక్షల వాహనాలు ఉండగా లైసెన్స్‌ల సంఖ్య 4.8 లక్షలు మాత్రమే ఉండడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. మూడు లక్షల మంది ఎటువంటి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు కలిగి ఉన్నట్లు రవాణాశాఖ రికార్డులు చెబుతున్నాయి. నిత్యం ట్రాఫిక్, రవాణా అధికారుల తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా అనేక మంది వాహనదారులు పట్టుబడుతూనే ఉన్నారు. డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియ రవాణా అధికారులు సులభతరం చేసినా వాహనదారులు నిర్లక్ష్యం చేయడం విమర్శలకు తావిస్తోంది.

**లైసెన్స్ లేకుండానే రోడ్డెక్కుతున్న వాహనాలు**

ఏటా వేలాది వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. అదే స్థాయిలో వాహన యజమానులు లైసెన్స్‌లు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. నైపుణ్యం లేని వ్యక్తులు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అందులో మైనర్లే అధికంగా ఉన్నారు. పిల్లలు మారాం చేస్తున్నారని తల్లిదండ్రులు వాహనాలు కొనిస్తున్నారు. రహదారుల సామర్థ్యానికి మించిన వాహనాలు కొనిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారికి డ్రైవింగ్ లైసెన్స్ తీసివ్వడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు.

**మహిళలు, మైనర్లే అధికం**

ఇంటి అవసరాలకు, పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లడానికి, ఉద్యోగ రీత్యా మహిళలు వాహనాలను వినియోగిస్తున్నారు. వీరిలో 75 శాతం మందికి లైసెన్సు ఉండడం లేదు. వారితో పాటు మైనర్లు సైతం అధికంగా ఉన్నారు. ఒక్కో బైక్‌పై ఇద్దరు, ముగ్గురిని ఎక్కించుకుని రోడ్లపై సవారీ చేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధిస్తున్నా వారిలో ఎలాంటి చలనం రావడం లేదు. జరిమానాలు కట్టేసి వెళ్లిపోతున్నారే తప్ప లైసెన్స్‌లు తీసుకోవడంపై ఆసక్తి చూపడం లేదు.

**లైసెన్స్ తీసుకోవడం సులభతరమే**

ఇటీవల డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ రవాణాధికారులు సులభతరం చేశారు. ఎల్ఎల్ఆర్ మంజూరు చేసే విషయంలో ఎన్నో సడలింపులిచ్చారు. ఈ ఏడాదిలోనే వేలాది మందికి అధికారులు డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేశారు. వాస్తవానికి వాహనాల కన్నా డ్రైవింగ్ లైసెన్స్‌ల సంఖ్య అధికంగా ఉండాలి. ఎందుకంటే వాహన డ్రైవింగ్‌ను వృత్తిగా చేసుకుని వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. కార్లు, ఆటోలు, క్యాబ్‌లు, వ్యాన్లు, లారీలు ఇలా దాదాపుగా అన్ని వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్నవారు ఎక్కువగానే ఉన్నారు. వాహన యజమానికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉంటుంది. కొన్ని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలను, రవాణా వాహనాలను మినహాయిస్తే మిగిలిన వాటిలో అత్యధికం సొంత వాహనాలే ఉంటాయి. తిరుపతిలో రెండుకుపైగా వాహనాలున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. తల్లిదండ్రులు ఉద్యోగులైతే ఇరువురికీ రెండు వాహనాలు, పిల్లలకు బైక్‌లు కొనుగోలు చేస్తున్నారు.

### జిల్లా సమాచారం

| | |
|---|---|
| జనాభా | : 23 లక్షలు |
| వాహనాల సంఖ్య | : 8 లక్షలు |
| డ్రైవింగ్ లైసెన్స్‌ల సంఖ్య | : 4,80,000 |
| స్క్రాప్‌గా మారిన వాహనాల సంఖ్య | : 20 వేలు |
| డ్రై వింగ్ లైసెన్స్‌లు లేనివారి సంఖ్య | : 3 లక్షలు |

**కేసులు, జరిమానాలతో హడల్**

గతంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అధికారులకు పట్టుబడి రూ.100, రూ.200 జరిమానా కట్టడం, లేదా పైరవీలు చేసి తప్పించుకునేవారు. ఇటీవల కాలంలో డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనం నడిపితే కేసు నమోదు చేస్తున్నారు. అందులో ఒకరోజు నుంచి వారం రోజులు శిక్ష పడుతోంది. జరిమానాలు కూడా విధిస్తున్నారు. ఈ కారణంగా ఏడాది కాలంలో రవాణా కార్యాలయాలకు వెళ్లి లైసెన్సు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

**కఠినంగా వ్యవహరిస్తున్నాం**

గతంలో జరిమానాల వల్ల డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే విషయంలో వాహనదారులు నిర్లక్ష్యం చూపేవారు. ఇటీవల కఠిన చర్యలు తీసుకుంటూ కోర్టులో హాజరుపరుస్తున్నాం. వాహనం నడిపే వ్యక్తితో పాటు యజమాని మరొకరైతే అతడిపైనా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో లైసెన్స్ కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. వంద శాతం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉండాల్సిందే.

– ఆదినారాయణ, ఇన్‌చార్జ్ జిల్లా రవాణాశాఖాధికారి

## శ్రీవారి దర్శనానికి 16 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,068 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 33,372 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారి హుండీ కానుకలు రూ.3.48 కోట్లు లభించాయి. టైంస్లాట్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శన భాగ్యం కలుగుతోంది. ఇటీవల చిరుజల్లుల నేపథ్యంలో చలి వాతావరణం నెలకొంది.

## ఘనంగా ప్రారంభమైన రైతు మేళా



నాబార్డ్ రైతు ఉత్పత్తుల మేళా ప్రారంభోత్సవంలో ప్రముఖులు, నాబార్డ్ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ రీజినల్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ చిత్తూరు డీడీఎం సునీల్ పర్యవేక్షణలో మహతి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన తరంగ్ నాబార్డ్ రైతు ఉత్పత్తుల మేళా గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి నాబార్డ్ ఏపీ ఆర్‌వో జనరల్ మేనేజర్ డాక్టర్ కేవీఎస్.ప్రసాద్, డీజీఎం సీఆర్.అబువరాజన్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్.ప్రసాద్, రాస్ ఈడీ వెంకటరత్నంనాయుడు, మెప్మా పీడా స్మితి రాధమ్మ, డీఆర్‌డీఏ పీడీ స్మితి ప్రభావతి, ఆర్ఏఆర్ఎస్ఏ డీఆర్ డాక్టర్ సి.రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్ పాల్గొని మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేవీఎస్.ప్రసాద్ రైతుల సంఘటితతను ప్రోత్సహించడంలో ఎఫ్‌పీవోఎస్ కీలక పాత్రను వివరించారు. నాబార్డ్ రైతాంగానికి చేస్తున్న సహకారం, ఈ ప్రదర్శన ద్వారా వారు పొందే లాభాలను తెలియజేశారు. వినియోగదారుల అభిప్రాయాలను పరిగనణలోకి తీసుకొని ఎఫ్‌పీవోఎస్ తమ ఉత్పత్తులను మెరుగుపరచాలని సూచించారు. ఓఎన్‌డీసీ వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లలో చేరి, ఎఫ్‌పీవోఎస్ తమ మార్కెట్ పరిధిని విస్తరించవచ్చన్నారు. నాబార్డ్ డీడీఎం సునీల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 40 స్టాల్స్ ఉన్నాయని, సేంద్రీయ పండ్లు, బియ్యం, బెల్లం, కూరగాయలు, తేనె, ఊరగాయలు, పొడులు, జీడి పప్పు, జూట్ ఉత్పత్తులు, చింతపండు, కొబ్బరి ఉత్పత్తులు వంటివి అందుబాటు ఉన్నాయన్నారు. అంతేగాక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కళాత్మ క చెక్క పనులు, కలంకారి ఉత్పత్తులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేళాలో చిత్తూ రు డీసీసీబీ మొబైల్ ఏటీఎం వ్యాన్ సులభంగా ఆర్థిక సేవలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. కెనరా బ్యాంక్, సప్తగిరి బ్యాంక్ ప్రతినిధులకి క్రెడిట్ లింకేజెస్ సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా నింజీకార్ట్ అప్లికేషన్ సహాయంతో ఎఫ్‌పీవోఎస్, ఓఎఫ్‌పీవోస్ తమ ఉత్పత్తులను డిజిటల్ మార్కెట్‌లో ఓఎన్‌డీసీ పోర్టల్‌పై తమ ఉత్పత్తులను ప్రదర్శింపజేస్తున్నట్టు వెల్లడించారు. గురు, శుక్ర, శనివారం మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రొఫెసర్ డాక్టర్ సత్యగోపాల్, కెనరా బ్యాంక్ ఆర్ఎం నాగరాజు, తిరుపతి ఎల్‌డీఎం విశ్వనాథరెడ్డి, చిత్తూరు ఎల్‌డీఎం హరీష్, రోటరీ క్లబ్ ప్రతినిధి హేమచంద్ర, కేవీకే కరకంబాడి ప్రిన్సిపల్, సైంటిస్ట శ్రీనివాస్ హాజరయ్యారు.



## ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా?





పాత రామసేతు వంతెనపై పక్కకు ఒరిగిన ఇనుప ఆర్చి

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి పట్టణంలోని బ్రిటీష్ పాలనలో నిర్మించిన రామసేతు వంతెన దుస్థితికి చేరింది. దీనిపై భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా వంతెనకు ఇరువైపులా ఇనుప ఆర్చిలు నిర్మించారు. కానీ సూపర్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి దెబ్బతింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆర్చి పక్కకు ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. కానీ దీన్ని ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు. బిక్కుబిక్కు మంటూ ద్విచక్రవాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అధికారులు స్పందించి కొత్త ఆర్చిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్ట్

– 25 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం

**తిరుపతి క్రైమ్:** జిల్లాలో అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. పోలీసుల కథనం.. జిల్లా పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, అలిపిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో తమిళనాడుకు చెందిన మహేష్ మణికంఠ, వెస్ట్ గోదావరికి చెందిన షేక్‌అలీమొహమ్మద్దీ దొంగతనాలకు పాల్పడేవారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో 11 కేసులు నమోదయ్యాయి. వీరిని తిరుపతి పరిసర ప్రాంతాల్లో తచ్చాడుతుండగా గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముద్దాయి మహేష్ మణికంఠపై రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50కి పైగా కేసులున్నాయి. అదేవిధంగా షేక్‌అలీమొహిద్దిన్‌పై 40కి పైగా కేసులు నమోదైనట్టు పోలీసులు గుర్తించారు. వీరు రక్కీ నిర్వహించి దోపిడీలకు పాల్పడేవారు. అదేవిధంగా తాళం వేసి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడేవారు. మీరి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారు, 2.25 కిలోల వెండి, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు మంజూరు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

## పంటలపై ఆగని ఏనుగుల దాడి



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న అరటితోట

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలో పంటలపై ఏనుగుల దాడి కొనసాగుతూనే ఉంది. గురువారం తెల్లవారు జామున సైతం మరోసారి పంటలపై స్వైరవిహారం చేశాయి. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె సమీపంలోని అరటి, మామిడి తోటల్లో ప్రవేశించి నష్టం కలిగించాయి. చేతి కొచ్చిన పంటలు ఏనుగుల దాడిలో దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ అధికారులు ఏనుగులను కట్టడి చేసి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగియడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు అటు నుంచి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఇందులో తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా రావడంతో శ్రీకాళహస్తీశ్వరాలయం ఇసుకేస్తే రాలనంతగా నిండిపోయింది. గురువారం ఒక్కరోజే సుమారు 25 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 761 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 1,586 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు–కేతు పూజలు 1,312, రూ.750 పూజలు 342, రూ.1,500 పూజలు 124, రూ.2,500 పూజలు 104, రూ.5 వేల పూజలకు 20 మంది భక్తులు చేయించుకున్నట్టు పేర్కొన్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 11,301 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

## విశ్రాంత ఎస్‌ఐకి సామాజిక సేవే శిక్ష

- ప్రభుత్వాస్పత్రిలో ఆరు నెలల పాటు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని జడ్జిమెంట్
- యాక్సిడెంట్ కేసులో నగరి న్యాయమూర్తి వినూత్న తీర్పు



పోలీసు అదుపులో ముద్దాయి

**నగరి :** సాధారణంగా యాక్సిడెంట్ కేసులు కోర్టుల్లో నిరూపితమైతే న్యాయమూర్తులు జైలు శిక్ష, జరిమానా విధించడం పరిపాటి. అయితే ఇటీవల కాలంలో కొన్నిచోట్ల వినూత్నమైన శిక్షలతో న్యాయమూర్తులు నిందితులను సామాజికసేవ వైపు మరలిస్తున్నారు. ఇదే కోవలో గురువారం నగరి న్యాయమూర్తి ఓ విశ్రాంత ఎస్‌ఐకి యాక్సిడెంట్ కేసులో జరిమానా విధించడంతోపాటు సామాజిక సేవ చేయాలని తీర్పునిచ్చారు. సీఐ సురేష్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు.. తిరుపతికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ వెంకటరమణ తిరుత్తణికి కారులో వెళుతున్న సమయంలో నెత్తం కండ్రిగ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న కీళపట్టు బీసీ కాలనీకి చెందిన రైతు శ్రీనివాసులును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు మృతి చెందారు. 2022 ఆగస్టు 7వ తేదీ ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు పీఎస్ మహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఏఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు గురువారం తుది విచారణకు రాగా నేరం నిరూపితమైంది. దీంతో జడ్జి విష్ణువర్మ మృతుని కుటుంబానికి రూ.పది వేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఆరు నెలల పాటు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని విశ్రాంత ఎస్ఐ వెంకటరమణకు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎ.రామకాంతి వాదించారు. ఈ వినూత్న తీర్పు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చర్చనీయాంశమైంది.